TGTEL/26/A0372

మన మహతి న్యూస్

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బజ్జూర్ల శ్రీనివాస్, డాక్టర్. ప్రకాస్ జాదవ్ సంపుటి : 01 సంచిక : 80 శనివారం, ఏప్రిల్ 18, 2026 , పేజీలు - 5 వెల: 4/- manamahatinews.com

# మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు

## - ప్రభు త్వానికి మాట రానివ్వద్దని సీఎం ఆదేశాలు



హైదరాబాద్ :కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు ఎన్డీఎస్ఏ మార్గదర్శకా లకు అనుగుణంగానే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి బ్యారేజీల ప్రస్తుత స్థితిగతులపై అధికారు లు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల పునరుద్ధరణ పనుల కోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కల్నల్ పరీక్షిత్ మెహ్రాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. బ్యారేజీల తనిఖీలు, బోరు బావుల తవ్వకాలు, పనుల వేగాన్ని పెంచడానికి తీసుకున్న చర్యల పురోగతి గురించి ఆయన ఆరా తీశారు.ప్రభుత్వానికి ఎటువంటి మాట రానివ్వకూడదు : ఈ మేరకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద బోర్ల తవ్వకాల పనులు ఈ నెల చివరి నాటికి ఊపందుకొంటాయని కల్నల్ పరీక్షిత్ వివరించినట్లు తెలిసింది. పునరుద్ధరణ పనుల వేగాన్ని ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉద్ఘాటిస్తూ తాత్కాలిక చర్యలకు పాల్పడటం లేదా పనులను అసంపూర్ణంగా వదిలేయడం వంటివి చేయకూడదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రభుత్వానికి ఎటువంటి మాట రానివ్వద్దని, ఇబ్బందులకు ఎలాంటి తావు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారుపూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాలి : గత ప్రభుత్వం ఇలాంటి నిర్లక్ష్యపూరిత పనులు చేసి అనేక తప్పిదాలు చేయడం వల్లే ఈ బ్యారేజీలు నిరుపయోగంగా ఉండిపోయాయని రేవంత్ పేర్కొన్నారు. ఇటువంటి తప్పులు మళ్లీ జరగకుండా చూసుకోవాలని, బ్యారేజీలను చాలా పకడ్బందీగా పునరుద్ధరించి వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శులు శ్రీధర్, సందీప్‌కుమార్ సుల్తానియా, రామగుండం సీఈ శ్రీనివాస్ గుప్తా, మాణిక్? రాజ్?, ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు. మేడిగడ్డకు వెళ్లి పరిశీలించనున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు : ఇదిలా ఉండగా మేడిగడ్డ ఆనకట్ట మరమ్మతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు అక్కడకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన పార్టీ నేతలు కొందరు శనివారం రోజున మేడిగడ్డ ఆనకట్టను పరిశీలించనున్నారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళ్లనున్నారు. ఆనకట్ట మరమ్మతుల ప్రక్రియను పరిశీలించను న్నారు. దాంతో రెండు రోజుల ముందే అక్కడకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. పునరుద్ధరణ పనుల కోసం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగం పెంచడానికి ప్రభుత్వం దృష్టి పెట్టింది. రూ.వేల కోట్ల విలువైన సాగునీటి పథకాన్ని అతి త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేలా కసరత్తు చేస్తోంది. దానికి తగ్గట్టుగా బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాట్లు చేసినట్లు ఇటీవల ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.

# బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు



హైదరాబాద్, ఏప్రిల్ 17 : బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. (శుక్రవారం) తెలంగాణ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు , ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. బీసీ విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై సమావేశంలో మాట్లాడామని తెలిపారు.బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీసీ గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని అన్నారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు చేరాలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచాలను.. శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు

# బాంబు బెదిరింపు



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని రద్దీగా ఉండే ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో బాంబు ఉందంటూ వచ్చిన ఒక ఫోన్ కాల్ శుక్ర వారం నాడు తీవ్ర కలకలం సృష్టించింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మెట్రో సిబ్బందికి ఫోన్ చేసి, స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు బెదిరించాడు. దీంతో ఒక్కసారిగా స్టేషన్ పరిసరాల్లో ఆందోళన నెలకొంది. సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించ డంతో వారు రంగంలోకి దిగారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, బాంబ్ స్క్వాడ్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలతో స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ స్టేషన్ లోని ప్రతి మూలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తరబడి గాలించారు. అయితే, ఎక్కడా ఎలాంటి బాంబు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభించకపోవడంతో 'ఫేక్ కాల్' అని పోలీసులు నిర్ధారించారు.

## నార్త్ - సౌత్ యుద్ధం అంటూ

# విషం చిమ్ముతున్నారు




హైదరాబాద్, ఏప్రిల్ 17: మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారు' అని అన్నారు.

# శాస్త్రిపురం ఆర్‌వోబీని

## ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ :పాతబస్తీ వాసులకు గుడ్ న్యూస్. శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు. 490 మీటర్ల పొడవు, 16.6 మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసలుగా ఈ ఆర్‌వోబీని నిర్మించారు.మైలార్‌దేవ్‌పల్లి నుంచి వట్టేపల్లి మీదుగా ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలను అనుసంధానించే ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు ఖర్చు చేసింది. సికింద్రాబాద్-ఫలక్‌నుమా-శివరాంపల్లి రైల్వే లైన్ మధ్యలో ఇన్నాళ్లూ శాస్త్రిపురం వద్ద లెవల్ క్రాసింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురువుతున్నాయి. రైల్వే గేటు పడినప్పుడల్లా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయేది. దీని వల్ల పెద్ద ఎత్తున ఇంధనం కూడా వృథా అయ్యేది. ప్రయాణికులు నిరీక్షించలేక అసహనానికి గురయ్యేవారు. ఇప్పుడు ఉద్దంగడ్డ రైల్వే గేటు వద్ద నిర్మించిన శాస్త్రిపురం ఆర్వోబీ అందుబాటులోకి రావడంతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి వట్టేపల్లి మీదుగా ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోకు ప్రయాణించే వారికి 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది.శాస్త్రిపురం ఆర్‌వోబీ పనులకు జీహెచ్ఎంసీ 2017లోనే ఆమోదం తెలిపింది. కానీ భూసేకరణ ఆలస్యం కావడం, రైల్వే శాఖ అనుమతుల కారణంగా ఈ ప్రాజెక్టు మొదలుకావడానికి మరో నాలుగేళ్లు సమయం పట్టింది. 2022లో ఈ వంతెన పనులు జోరందుకున్నాయి. ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత గత నెల మార్చి నాటికి ఈ ఆర్‌వోబీ పనులు పూర్తయ్యాయి. ఈ ఆర్‌వోబీ కోసం ప్రయాణికులు ఎంతగా ఎదురు చూశారంటే.. అధికారికంగా ప్రారంభించడానికి ముందే.. బారికేడ్లను తొలగించి మరీ అడపాదడపా దీని మీదుగా రాకపోకలు సాగించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై మా ప్రభుత్వానికి

# ఎలాంటి దురుద్దేశం లేదు



ఢిల్లీ, ఏప్రిల్ 17 : కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. (శుక్రవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## తేజస్వి సూర్యపై పోలీసులకు

# బీఆర్ఎస్ ఫిర్యాదు




ఢిల్లీ, ఏప్రిల్ 17: బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీ య దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పా టును పాకిస్థాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసు లకు ఫిర్యాదు చేసిన వ్యవహారం చర్చనీయాం శమైంది.ఎంపీ తేజస్వి సూర్యపై పోలీసులకు ఫిర్యాదు.లోక్‌సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదులో ఏముందంటే..?ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు.చట్టపరమైన చర్యలకు డిమాండ్..తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ చారిత్రక ఘట్టాన్ని తక్కువ చేసి చూపడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. 'తెలంగాణ అంటే పోరాటాల గడ్డ' అని.. అలాంటి పవిత్రమైన ఉద్యమ ఫలితాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కేటీఆర్ పాదయాత్ర

# ఇప్పుడెందుకు



హైదరాబాద్, ఏప్రిల్ 17 : పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. తెలంగాణలో అన్నివర్గాల కు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. (శుక్రవారం) జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తా..ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

# హెల్మెట్ తప్పనిసరి: ఏసీపీ ప్రశాంత్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ లావుడియా రవి నాయక్.

- అరైవ్ అలైవ్ ప్రచారానికి ప్రజల మద్దతు







హనుమకొండ జిల్లా ఏప్రిల్ 17 న్యూస్

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ ప్రచారంలో భాగంగా హసన్పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీఐ చేరాలు ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు.సుమారు 100 మందికి పైగా గ్రామస్తులు పాల్గొని రోడ్డు భద్రతపై ప్రమాణం చేశారు. గ్రామస్తులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏసిపి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.హెల్మెట్‌ను ధరించడం వల్ల వారి ప్రాణాలకు, బంగారు భవితకు రక్షణ కల్పించిన వారమవుతామన్నారు.మనం ధరించే హెల్మెట్ వల్ల అది మన ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు తలకు తగిలే చిన్న గాయం కూడా ప్రాణాంతకం కావచ్చు...ఆ ప్రమాదం నుండి మనల్ని రక్షించేది ఒక్క హెల్మెట్ మాత్రమేనాని అన్నారు.మీరు వాహనంపై బయటకు వెళ్ళినప్పుడు.. ఇంటి వద్ద మీ కోసం మీ భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు ఎదురుచూస్తుంటారని మర్చిపోవదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి ,గోవర్ధన్ , స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవినాయక్ ,రిలీఫ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రమేష్ ,గ్రామ పెద్దలు, యువకులు,పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# మానవ సేవే మాధవసేవ

మన మహతి న్యూస్ ప్రతినిధి పాల్వంచ:

గత 9 నెలలు నుండి ప్రతి నెల పిత్రు అమావాస్య పర్వదినం సందర్భంగా మానవసేవే మాధవ సేవ కార్యనిర్వాహణ సభ్యుల ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ నటరాజ్ సెంటర్ నందు 300 మందికి పైగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుంది. ఈ శుక్రవారం అమావాస్య సందర్భంగా జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన కమిటీ వారిని అభినందిస్తూ గత తొమ్మిది నెలలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఇక ముందు కూడా కొనసాగించాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో మానవసేవ మాధవసేవ కార్యనిర్వాహణ సభ్యులు బండారు సత్యనారాయణ చారి,బండారు శ్రీనివాసాచారి,గుత్త శివన్నా రాయణ,దాసరి రాజు,గడిపేసి నరసింహారావు,బండారు రామాచారి,ధనుమూరి వీరాచారి, లింగాచారి,నరేష్,కోటాసత్యనారాయణ, జగదీశ్వర్ , శ్రీనివాసరావు, భానుమూర్తి,రామకృష్ణ పాల్గొన్నారు.






# జాగ్రత్తలు పాటిద్దాం ఎండ తీవ్రత నుండి సురక్షితంగా ఉందాం

- లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ సూచన.





హనుమకొండ జిల్లా ఏప్రిల్ 17 న్యూస్

ఎండ ఎక్కువగా ఉన్న రోజుల్లో గొడుగు తప్పనిసరిగా వాడాలి దూదితో నేయబడిన తెలుపు/లేత రంగు పలుచటి వస్త్రాలను ధరించాలి బహిరంగ ప్రదేశాలలో నెత్తికి టోపీ లేదా రుమాలు పెట్టుకోవాలిఉప్పు కలిపిన మజ్జిగ గ్లూకోజు కలిపిన నీరు ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (రా=రా) తీసుకోవాలివడదెబ్బకు గురైన వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలిచల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరం అంతా తుడవాలిబాధితులని ఫ్యాను క్రింద ఉంచాలి సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితిలో ఆశించిన మార్పు లేనిచో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ తెలిపారు.

# డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డీటీఎఫ్ నూతన నారాయణపేట మండల కమిటీ ఎన్నిక.

- మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.51% ఫిట్మెంట్తో పిఆర్సి ని వెంటనే ప్రకటించాలి
- పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- ఈ హెచ్ ఎస్.ను వెంటనే అమల్లోకి తేవాలి

నారాయణపేట మండల

- డీటీఏఫ్ నూతన కమిటి కన్వీనర్ గా మౌనిక,కో
-కన్వీనర్ గా కవిత నియామం.

మన మహతి న్యూస్ ప్రతినిధి శుక్రవారం.,

నారాయణపేట కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో నారాయణ పేట నూతన కమిటీ ఎన్నికయింది. ఈ కార్యక్రమంలో డీటీఏఫ్ జిల్లా అధ్యక్షులు హైమావతి, ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర,
మక్తల్ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికైన హామీల్లో చెప్పినట్టుగా, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానమైన ఓపిఎస్ ను పునరుద్ధరించాలి,ప్రభుత్వం ఇంకా ఆలస్యం చేయకుండా



పి ఆర్ సి నివేదికను తెప్పించుకొని 51% ఫిట్మెంట్ తో పి ఆర్ సి ఇవ్వాలి, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టాలి. ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్స్ ను వెంటనే అమల్లోకి తేపాలని డిమాండ్ చేసారు.కన్వీనర్ మౌనిక, కో-కన్వీనర్ కవిత మాట్లాడుతూ సంఘంలో తమకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తూ, ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలపై స్పందిస్తామని, తెలిపారు.జిల్లా అధ్యక్షురాలు హైమావతి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా,కామన్ స్కూల్ విద్యా విధానం కోసం, శాస్త్రీయమైన విద్యా విధానం కోసం, నిరంతరాయంగా ఉద్యమిస్తోంది. వృత్తి నిబద్ధత, మరియు సామాజిక బాధ్యతతో,ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యలపై, ఉపాధ్యాయ వ్యతిరేక జీవోలపై, ప్రభుత్వ విధానాలపై మాట్లాడుతూనే, అంతే బాధ్యతతో విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతుంది. పై అధికారుల నిరంకుశ పోకడలను నిరంతరం ప్రతిఘటిస్తుం దని.అందరికీ ఒకే విధమైన నాణ్యమైన విద్య అందడం డి.టి.ఎఫ్ సామాజిక లక్ష్యాలలో ప్రధానమైనదని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర,మక్తల్ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

# అమ్మపల్లి లో విద్యార్థులే ఉపాధ్యాయులు సందడిగా స్వయం పరిపాలన దినోత్సవం.

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.మాగనూరు మండలం అమ్మపల్లి లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు.

1): కలెక్టర్ గా బి కే ,స్వప్న
2) : డీ.ఈ.ఓ బి ప్రేజ్వాల్
3) : ఎం.ఈ.ఓ బి ఎన్ .వైష్ణవి
4) : హెచ్.ఎమ్ బి ఈశ్వర్
5) : పి.టి బి ఎం .అనిల్
6) : అటెండర్ గా - గణేష్

వ్యవహరించారు ..



ఉపాధ్యాయులుగా : అనిత .మహేశ్వరి . ఎన్. శ్రీవల్లి . కే. శ్రీవల్లి. కెహారిక కే . ప్రీతి పి.నితిన్ .జి .నితిన్ .బి .రవితేజ ఎన్ .విజయ్. శ్రీనిధి. నవ శ్రీ. ఎన్ . శ్రీహరి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీను సార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు. ఉపాధ్యాయురాలు సల్లబాయి మేడం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. జీవితంలో ఏమి కావాలో విద్యార్థి దశలోనే నిర్ణయించుకోవాలని తద్వారా అనుకున్నా లక్ష్యాన్ని సాధించవచ్చున్నారు. తధానంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు ..

# దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా** మక్తల్ నియోజకవర్గం.మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధికారులకు వినతిపత్రాలు
ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ రోజు తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ ఢ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ...మక్తల్..తహసీల్దార్ సతీష్ కుమార్ కు వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కు రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న



సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని, 2026 జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని,. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జేసి నాయకులు జిల్లా జెఎసి నాయకులు రవీందర్, నాగార్జున, ప్రహ్లాద్ మండలం జేఎసి నాయకులు నరసింహ రాకేష్ అనిల్ రెడ్డి,రాజ్ గోపాల్,ఆంజనేయులు, వెంకటయ్య, నరసింహులు, వెంకటేష్, నరసింహ, రాము, రాజ ఆంజనేయులు, జగదీష్, రవీందర్ రెడ్డి, రవి, కుర్మయ్య, ప్రవర్ధన్ రెడ్డి, నర్సింహా, మానస, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి బుద్ధి లేదు.. అధికారులకు,ప్రజాప్రతినిధులకు సోయిలేదు

- అద్వాన్నపు జక్లేర్ చెరువు కట్ట రహదారిపై సెల్ఫీతో సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ నిరసన..

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం. జక్లేర్ చెరువు కట్ట.రహదారులు ధ్వంసమైన పట్టించుకోని ఈ ప్రభుత్వానికి బుద్ధి ఏమాత్రం లేదని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ విమర్శించారు.జక్లేర్ చెరువు కట్టపై రహదారి కంకర తేలి గోతులమయమై ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ధ్వజమెత్తారు.రేవంత్ సర్కారు నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ జక్లేర్ చెరువు కట్టపై అధ్వానంగా మారిన రహదారిపై శుక్రవారం సెల్ఫీలు దిగుతూ మహేష్ గౌడ్ నిరసన తెలిపారు.ఇంతలా ధ్వంసం అయిన రోడ్లపై రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ కంకర తేలిన రహదారిపై నిరంతరం అనేక రకాల వాహనాలు ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయని తెలిపారు.సుమారు కిలోమీటర్ మేర ఉన్న ఈ అద్వాన్నపు రహదారికి తారు రోడ్డు వేయించడానికి ఎలాగు చేతకావడం లేదని కనీసం తాత్కాలిక మరమ్మతులన్నా చేయించాలన్న కనీస స్పృహ కూడా ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటన్నారు.తక్షణమే రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రయాణికులు ఇక్కట్లు తొలగించాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు.



# సంగారెడ్డి జిల్లా, జోగిపేట సబ్ జైల్‌లో ఏర్పాటు చేస్తున్న ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించిన ఎం. శ్రీనివాస్, ఐజిపి అడిషనల్ డిసిపి క్రైమ్స్.





**సంగారెడ్డి, ఏప్రిల్ 17,మన మహతి న్యూస్ :** జోగిపేట సబ్ జైల్‌లో ఏర్పాటు చేస్తున్న ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను ఐజీ ఎం.శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను సమగ్రంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. విదేశీయులు అనుకూలంగా ఉండే విధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ట్రాన్సిట్ హోంను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణ పనులు నాణ్యతగా, సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్శనలో ఐజీ వెంట సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డీసీపీ కృష్ణ చైతన్య, డిఎస్పీ సత్తయ్య గౌడ్, జోగిపేట ఇన్స్పెక్టర్స్ అనిల్ కుమార్, ఎస్సై ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి లక్ష్మీదేవిపల్లి మండలంలో నిరసన ర్యాలీ




**మన మహతి న్యూస్ లక్ష్మీదేవి పల్లి**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం పిలుపు మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కరవు భత్యాలు, వేతన సవరణలు, పెండింగ్ బకాయిలు సహా తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వంపై నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దార్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వాన్ని తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల కోసం భవిష్యత్తులో మరింత ఉధృతంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## తిరువూరులో జాతీయ రహదారి ఆక్రమణల తొలగింపుపై సమీక్ష సమావేశం



**మన మహతి ప్రతినిధి:బ్రమరాంబ తిరువూరు న్యూస్,ఏప్రిల్ 19**
ఎన్టీఆర్ జిల్లా,తిరువూరుతిరువూరు పురపాలక సంఘం కార్యాలయంలో జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణల తొలగింపుపై ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్డీవో, ఎంఆర్ఓ,మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు,జాతీయ రహదారుల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించిన ఆక్రమణలను నిబంధనల ప్రకారం తొలగించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు.సంబంధిత కాంట్రాక్టర్లకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు,అలాగే నేషనల్ హైవే అథారిటీస్ద్వారా నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.రామచంద్రాపురం నుంచి తిరువూరు వరకు సుమారు 36 .కిలోమీటర్ల పరిధిలో ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు.ఇందులో చీమలపాడు, కంభంపాడు గ్రామాలతో పాటు తిరువూరులో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయని పేర్కొన్నారు.నోటీసుల ద్వారా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించామని,ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.నియమ నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నుంచి తిరువూరు పట్టణంలో ఆక్రమణలు తొలగించే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్డీఓ తో కలిసి విస్సన్నపేటలో పర్యటించి అక్కడ కూడా ఆక్రమణలు గుర్తిస్తామని పేర్కొన్నారు.

## ప్రాణం నిలిపే 'గోల్డెన్ అవర్'



**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా** మక్తల్ నియోజకవర్గం.రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంట అత్యంత కీలకమని, ఆ సమయంలో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని సీఐ రామ్లాల్ తెలిపారు. 'అరైవ్, అలైవ్' కార్యక్రమంలో భాగంగా అంబులెన్స్ డ్రైవర్లు, స్వయంసేవకులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

## మక్తల్ మండల కేంద్రంలో. వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా**




మక్తల్ నియోజకవర్గం.మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మండలంలోని మంతన్రోడ్, కాట్రేవుపల్లి, గుడిగండ్ల, జక్లేర్, కాచువార్, గొల్లపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాధా లక్ష్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీశ్, స్థానిక సర్పంచులు, రైతులు పాల్గొన్నారు

# ప్రతిభా ప్రదర్శన వేదికగా 'సాధన-2026'.



**సంగారెడ్డి, ఏప్రిల్ 17,మన మహతి న్యూస్ :**లలిత, ప్రదర్శన కళల విభాగం విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే 'సాధన-2026'ను శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం డ్యాన్స్ స్టూడియోలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యూమాని టీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపకులు కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, థియేటర్, లలిత కళలలోని మైనర్, ఓపెన్ ఎలెక్టివ్ కోర్సులలో చేరిన విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు.
సెమిస్టర్ చివరి ప్రాక్టికల్ పరీక్షలలో భాగంగా, విద్యార్థులు తమ అభ్యాసాన్ని, కళాత్మక ఎదుగుదలను ప్రతిబింబించేలా ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూచిపూడి, భరతనాట్యం, థియేటర్ ఆర్ట్స్ విభాగాల నుంచి పాల్గొన్నవారు తమ అకడమిక్ మూల్యాంకనంలో భాగంగా





అద్భుతమైన వేదిక ప్రదర్శనలు ఇచ్చారు.కూచిపూడి విభాగానికి డాక్టర్ వై.లలిత సింధూరి, వైష్ణవి ప్రతివాది మార్గదర్శకత్వం వహించగా, భరతనాట్యం ప్రదర్శనలకు అంజు అరవింద్ మార్గదర్శకత్వం వహించారు. నాటక కళల ప్రదర్శనలకు డాక్టర్ శ్యామ్ ప్రకాష్ నాయకత్వం వహించగా, కర్ణాటక సంగీత విద్యార్థులకు మృదురవళి దర్భ మార్గదర్శకత్వంలో శిక్షణ ఇచ్చారు. మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్ పై వాసు అందించిన ప్రత్యక్ష సంగీత సహకారంతో ఈ ప్రదర్శనలు మరింత సుసంపన్నమయ్యాయి.ఈ కార్యక్రమానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ప్రతి ప్రదర్శన దాని కళాత్మక నైపుణ్యానికి, భావ గాఢతకు విస్తృత ప్రశంసలను అందుకుంది.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" ఐదవ రోజు కార్యక్రమాలు.

- గోల్డెన్ అవర్, ప్రమాద సమయంలో చేయవలసిన ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలు.
- ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం సురక్షిత ప్రయాణం చేద్దాం.








**సంగారెడ్డి, ఏప్రిల్ 17,మన మహతి న్యూస్ :**
ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "అరైవ్ అలైవ్" ఐదవ రోజు (ఏప్రిల్-17) గోల్డెన్ అవర్ ప్రాధాన్యత, ప్రమాద సమయంలో చేయవలసిన ప్రథమ చికిత్స వంటి అంశాలపై మెడికల్ సిబ్బందితో కలిసి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని అన్నారు. సోషల్ మీడియా, ఇతర సామాజిక మాధ్యమాలు, కళాబృందాల ద్వారా రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించినప్పుడే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. అలాగే పరిమిత వేగంతో ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. జిల్లా ప్రజలు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని కోరారు."అరైవ్ అలైవ్" ఐదవ రోజు కార్యక్రమాలలో భాగంగా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్లో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం, బాధితులను సమీప ఆసుపత్రికి తరలించడం వంటి చర్యలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఈ విధంగా ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారికి "రహ్ వీర్" పథకం కింద నగదు బహుమతులు అందజేయడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా ప్రమాదాల సమయంలో తక్షణ స్పందన, ప్రథమ చికిత్స, సిపిఆర్ వంటి అంశాలపై మెడికల్ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

## కట్టలేరు సప్లై ఛానల్ పూడిక తీత మరమ్మత్తుల ను ప్రారంభించిన - శాసనసభ్యులు కులికపూడి శ్రీనివాసరావు

**మన మహతి ప్రతినిధ: భ్రమరాంబతిరువూరు న్యూస్,ఏప్రిల్ .19**
తిరువూరు మండలం, కోకిలంపాడు గ్రామంలో కట్టలేరు సప్లై ఛానల్ పూడికతీత మరియు మరమ్మత్తుల పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వనరుల అభివృద్ధి ద్వారా రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. పూడికతో నిండిపోయిన కాలువలను శుభ్రపరచడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి,చివరి ఎకరానికి కూడా నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కట్టలేరు సప్లైఛానల్ పూడికతీత పనులు పూర్తయిన అనంతరం,
ఈ ప్రాంతంలోని పంటలకు సమృద్ధిగా నీరు అందడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల రైతులకు ద్విగుణీకృత లాభం చేకూరుతుందని శాసనసభ్యులు వారు పేర్కొన్నారు.అలాగే,గ్రామంలో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం





చేస్తున్నామని,రహదారులు, కాలువలు,తాగునీటి సౌకర్యాలు వంటి మౌళిక వసతులను మెరుగుపరచడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని శాసనసభ్యులు వారు తెలియజేసారు.కట్టలేరు సప్లై ఛానల్ పూడికతీత మరియు మరమ్మత్తుల పనులను ప్రారంభించిన వారికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేస్తూ, పనులు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.గ్రామ అభివృద్ధి,రైతుల సంక్షేమమే తన ముఖ్య లక్ష్యమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలు అందిస్తానని గౌరవ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,పట్టణ నాయకులు, అధికారులు,గ్రామ పెద్దలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో కాంగ్రెస్ ర్యాలీ: జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు

**సంగారెడ్డి, ఏప్రిల్ 17,మన మహతి న్యూస్:**సంగారెడ్డి పట్టణంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులో ఉన్న లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్లో "హిస్సా చోరీ"పై బలంగా పోరాడుతున్నారని తెలిపారు. దేశ ప్రజల హక్కులను కాపాడేందుకు ఆయన చేస్తున్న పోరాటానికి సంగారెడ్డి నుంచి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు.నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా బిల్లుపై రాజకీయ కుట్ర జరుగుతోందని రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలను జగ్గారెడ్డి ప్రస్తావించారు. వచ్చే ఎన్నికల్లో ఓటు బ్యాంకును ప్రభావితం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీలిమిటేషన్ను వినియోగించుకుంటోందని ఆరోపించారు.
అలాగే, ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఈవీఎంల రూపకల్పనపై కూడా సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ను ప్రభావితం చేసి నాలుగోసారి




అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకత లేదని, అయితే అందులో ఉన్న లోపాలను సరిచేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. యూపీఏ హయాంలోనే సోనియా గాంధీ ఈ బిల్లును ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.దేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడేందుకు అందరూ అప్రమత్తంగా ఉండి రాహుల్ గాంధీకి మద్దతు ఇవ్వాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు

# ఏ.కొండూరు మండల ప్రజలకు ఏ.కొండూరు పోలీస్ వారి సూచనలు మరియు హెచ్చరికలు

**మన మహతి ప్రతినిధి:భ్రమరాంబఏ.కొండూరు న్యూస్,ఏప్రిల్.18**
ఏ .కొండూరు మండల ప్రజలకు కొండూరు పోలీసు మాది హెచ్చరికలతో సూచనలు.
ప్రస్తుతం వేసవి కాలంలో రోడ్లపై గేదెలు వదిలివేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని జరుగుతున్నాయి కూడా అని
రాత్రి సమయంలో ఇవి కనిపించక వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉంది.
కాబట్టి గేదెలు రోడ్లపై వదిలివేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి చేశారు.
గేదెలు వదిలివేస్తే పోలీస్ కేసులు నమోదు చేయడంతో పాటు,కఠిన చర్యలు తీడుకొనబడతాయి అని తెలియజేస్తున్నాము.
18 .సంవత్సరాల లోపు పిల్లలు వాహనం నడపడం చట్ట విరుద్ధం.
మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తాం.
తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని
వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.
హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ప్రాణాలకు ప్రమాదం.
చిన్న తప్పు పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది అని సూచించిన పోలీస్
మీ కుటుంబం కోసం అయినా హెల్మెట్ తప్పనిసరిగా



ధరించండి.
క్రికెట్ బెట్టింగ్,ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడటం పూర్తిగా చట్ట రిత్యా నేరమని
ఇవి మొదట చిన్న మొత్తాలతో మొదలై,తరువాత పెద్ద మొత్తంలో డబ్బు నష్టానికి దారి తీస్తాయి.
చాలామంది అప్పుల్లో పడుతూ కుటుంబ సమస్యలు,ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
బెట్టింగ్‌లో పట్టుబడితే పోలీస్ కేసులు నమోదై,జైలుశిక్ష కూడా పడే అవకాశం ఉంది.
యువత,విద్యార్థులు దయచేసి
ఈ బెట్టింగ్‌లకు పూర్తిగా దూరంగా ఉండాలని లేకుంటే
పోలీస్లకు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకొబడతాయి అని హెచ్చరించిన ఏ.కొండూరు పోలీస్
పిల్లల భద్రత మన అందరి బాధ్యత.18 .సంవత్సరాల లోపు పిల్లలపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించడం,వేధించడం, అనుచితంగా తాకడం, భయపెట్టడం వంటి చర్యలు చేస్తే పి ఓ సి ఎస్ టు చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయి.
తల్లిదండ్రులు పిల్లలపై ఎప్పటికప్పుడు నిగ్రహం వహించాలని.
పిల్లలు ఏదైనా సమస్య చెబితే వెంటనే స్పందించాలని
ఏదైనా అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే 112 .నంబర్‌కు కాల్ చేయండి లేదా ఏ. కొండూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని
సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని ఏ .కొండూరు పోలీస్ వారు సూచించారు
మనందరం జాగ్రత్తగా ఉంటేనే మన పిల్లలు,మన కుటుంబాలు, మన ఊరు సురక్షితంగా ఉంటాయి ఉంటాయని ఈ సందర్భంగా ఏ.కొండూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గంధం లక్ష్మణుడు ప్రజలకు సూచించారు.

# అమరజీవి దండి భాస్కర్ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళ్ళు అర్పించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్



**ది. 17-04-2026 శుక్రవారం. ఖమ్మం జిల్లా** ఏదులాపురం మున్సిపాలిటీ. విద్యార్థి దశ నుండి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకి ముందుండి ప్రజల కోసం శ్రమించిన విప్లవ నాయకులు గొప్ప ఆదర్శ మూర్తి, ఎందరికో రాజకీయం గా మార్గదర్శి, ప్రముఖ జర్నలిస్ట్ సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు అయినటువంటి కామ్రేడ్ శ్రీ దండి భాస్కర్ గారి 10 వ వర్ధంది సందర్భంగా వారి స్మారక స్థూపం వద్ద కొబ్బరికాయ కొట్టి పూలు వేసి ఘన నివాళ్ళు అర్పించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్. ఈ సందర్భంగా వారితో మేళ్లచెరువు సురేష్, భద్రా చారీ పాల్గొన్నారు.

# జననేత మహమ్మద్ జావీద్ గారి మరణంపై డా. పీటర్ నాయక్ లకావత్ ప్రగాఢ సానుభూతి



**ఖమ్మం** నగర మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ జావీద్ గారి మరణం పట్ల తీవ్ర విషాదం వ్యక్తమవుతోంది. ఆయన మృతి ప్రజా జీవనానికి, రాజకీయ రంగానికి ఒక అపూర్వ లోటుగా భావించబడుతోంది. ఈ నేపథ్యంలో, ఇంటర్నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ డా. పీటర్ నాయక్ లకావత్ గారు స్పందిస్తూ, జావీద్ గారి మరణంపై ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సమాజానికి సేవ చేయడంలో ఆయన చూపిన అంకితభావం, ప్రజలతో కలిసిపోయే స్వభావం, రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని పేర్కొన్నారు. జావీద్ గారి వంటి నిస్వార్థ నాయకుడిని కోల్పోవడం సమాజానికి తీరని లోటని అభివర్ణించారు.
ఈ దుర్ఘటనలో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి ధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కఠిన హెచ్చరిక

**మన మహతి న్యూస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఈరోజు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, సంయుక్త చర్యా సంఘం నాయకులు తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సంయుక్త చర్యా సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి ఉద్యమంలో ఉపాధ్యాయ సంఘం ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వేతన సవరణ, పెండింగ్ కరవు భత్యాలు, పాత పింఛను విధానం అమలు, ఆరోగ్య కార్డులు సహా మొత్తం అరవై నాలుగు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.





# రాజకీయ దురుద్దేశంతోనే 'సెస్' స్వాధీనం.. ప్రైవేటీకరణ కోసమే ప్రభుత్వం కుట్రలు..!



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17** : వందలాదిమంది పోలీసు పహారా మధ్య, విధివిధానలు పాటించకుండా ఎన్పీడీసీఎల్ " సెస్ " సంస్థను స్వాధీనం చేసుకోవడం అక్రమమని, లాభాల్లో ఉన్న సంస్థను రూ.30 వేల కోట్ల నష్టాలున్న ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయడం దారుణమని సిరిసిల్ల సహకారం విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) చైర్మన్ చిక్కాల రామారావు ఆరోపించారు. శుక్రవారం సెస్ సంస్థలోని తన చాంబర్‌లో డైరెక్టర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సెస్ సంస్థను కుట్రపూరితంగా స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్న ఎన్పీడీసీఎల్ హస్తగతం చేసుకున్న పరిస్థితులను వివరించారు.
ఏప్రిల్1 వ తేదీన పోలీసు బలగాలు స్థానిక పోలీసుల సహకారంతో సెస్ సంస్థను చుట్టుముట్టి స్వాధీనం చేసుకున్నారని, తాము వివరణ కోరితే పైనుండి ఆదేశాలు ఉన్నాయని సీఎండి స్పష్టం చేశారని సిరిసిల్ల సహకారం విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) చైర్మన్ చిక్కాల రామారావు వెల్లడించారు. అలాగే సంస్థలోని సీసీ కెమెరాలు తొలగించారని, మరునాడు రహస్యంగా 6,7 నెంబర్ల జీవోలను తీశారని, వాటిని తమకు ఇవ్వలేదని.. తాము నెట్ లో డౌన్లోడ్ చేసుకున్నామని ఆయన తెలిపారు. 3.10 లక్షల మంది వినియోగదారులు, 3.51 లక్షల విద్యుత్ కనెక్షన్లతో కొనసాగుతున్న సంస్థపై అవినీతి మరక అంటిస్తూ.. కొంతమంది ఫిర్యాదుతో సంస్థను స్వాధీనం చేసుకోవడం సరైంది కాదని ఆయన మండిపడ్డారు. ఇది రాజకీయ దురుద్దేశంగా తాము భావిస్తున్నట్టు చైర్మన్ వెల్లడించారు. సెస్ సంస్థను స్వాధీనం చేసుకునేందుకు ఏడాదికాలంగా కుట్రలు జరుగుతున్నాయని, ప్రభుత్వ పెద్దలు పరోక్షంగా హెచ్చరికలు కూడా చేశారని సిరిసిల్ల సహకారం విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు.
కృష్ణయ్య కమిషన్ క్లీన్ చీట్
సెస్ సంస్థలో 2007 నుండి 2010 వరకు జరిగిన కార్యక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిందని, పాలకవర్గం దుర్వినియోగం చేశారని ఆరోపణలపై 51 ఎంక్వయిరీలు కూడా జరిగాయని సిరిసిల్ల సహకారం విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. దీనిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాయింట్ కలెక్టర్, సెస్ పర్సన్ ఇన్‌ఛార్జ్ అరుణ్ కుమార్ 2012లో విచారణకు ఆదేశించగా.. కృష్ణయ్య కమిషన్ 2013లో జేసీకి నివేదిక సమర్పించింది. అందులో పాలకవర్గం ఎలాంటి దుర్వినియోగానికి పాల్పడలేదని స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. 2010 అక్టోబర్ 26 తర్వాత తాను పదవి నుంచి దిగిపోయానని తర్వాత అల్లాడి రమేష్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించగా కృష్ణయ్య రిపోర్టును 16 సంవత్సరాల పాటు దాచి పెట్టారని రామారావు వెల్లడించారు. ఈ విజిలెన్స్ రిపోర్టును ఎందుకు బహిర్గతం చేయలేదని ఆయన ప్రశ్నించారు.

కృష్ణయ్య రిపోర్టు బైలా నిబంధనలు, ఎన్పీడీసీఎల్ గైడ్‌లైన్స్ ప్రకారం పారదర్శక పాలన సాగించినట్లు రిపోర్టు స్పష్టం చేసిందని రామారావు అన్నారు. అయితే రూ.3,08,97,306 వర్క్ ఆర్డర్లను సంస్థ పూర్తి చేయలేదని, దీనిపై 13 మంది ఉద్యోగులు బాధ్యులు అని చెప్పకుండా కేవలం పాలకవర్గంపై అభియోగాలు మోపి.. కుట్రపూరితంగా అవినీతి జరిగిందని సాకు చెబుతున్నారని ఆయన ఆరోపించారు. సెస్ సభ్యుల రూ.7 కోట్ల వాటా ధనం, రూ.400 కోట్ల ఆస్తులతో కూడిన సెస్ సంస్థ సంపన్నంగా ఉందని రామారావు స్పష్టం చేశారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టేకులపల్లి మండలంలో నిరసన

**మన మహతి న్యూస్ టేకులపల్లి** టేకులపల్లి మండలంలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన నిరసన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జూన్ 2లోపు వేతన సవరణ అమలు, పెండింగ్ బిల్లులను రెండు విడతల్లో చెల్లింపు, మే 1 నుండి ఆరోగ్య కార్డుల అమలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు వంటి ముఖ్య డిమాండ్లను ముందుకు తెచ్చారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న విరామ సమయంలో నిరసనలు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల బాధ్యులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వేతన సవరణలు, కరవు భత్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు




సహా మొత్తం సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం ముందు ఉంచిన అరవై ఒకటి డిమాండ్ల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు ప్రారంభించాలని కోరారు. అనంతరం మండల సంయుక్త చర్యా సంఘం తరఫున తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు, వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాలల జనాభా తగ్గింపు కుట్రా? గణాంకాల్లో మోసం బహిర్గతం చేయాలి

**- కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కుట్ర**
**- మాలలపై కుట్ర తోనే ఎస్సీ వర్గీకరణ చేసిన రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ లో ఉన్న మాల మంత్రులు బయటికి రావాలి**
**- మాలమహానాడు జిల్లా ఇంచార్జి దామాల సత్యం**

**ఖమ్మం జిల్లా బ్యూరో న్యూస్ ఏప్రిల్ 17**
తెలంగాణ రాష్ట్రంలో మాలల జనాభాపై ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలపై మాలమహానాడు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాలమహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి దామాల సత్యం మాట్లాడుతూ, 2011 జనగణన ప్రకారం మాలల జనాభా సుమారు 15 లక్షలు ఉండగా, తాజా లెక్కల్లో 14 లక్షలుగా తగ్గించడం అనుమానాస్పదమని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో మాలల జనాభా 55,70,244గా నమోదు కాగా, ఇప్పుడు తెలంగాణలో జనాభా తక్కువగా చూపించడం వెనుక అసలు కారణాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర కులాల జనాభాలో మార్పులు



లేకపోయినా, మాలల జనాభానే తగ్గించడం అనేది పక్కా కుట్రగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అంశంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సత్యం ఆరోపించారు. మాలల హక్కులు, ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా జనాభాను తగ్గించి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిజమైన గణాంకాలను బయటపెట్టాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాలలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడులు, భారీ నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. మాలల జనాభా అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, లెక్కల్లో పారదర్శకత పాటించాలని దామాల సత్యం డిమాండ్ చేశారు.

# డంపింగ్ యార్డును రద్దు చేసేంత వరకు వెనక్కి తగ్గేదే లేదు : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్ :** హుజురాబాద్ నియోజకవర్గం సిరసపల్లిలో డంపింగ్ యార్డు రద్దు చేయకపోతే జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ ,ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన చెత్తను తమ నియోజకవర్గంలో ఏర్పాటుకు యతిస్తంచాడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గత 25 రోజులుగా పార్టీలకు అతీతంగా అంబేద్కర్ చౌరస్తాలో నిరసనలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఈనెల 22 నుంచి పాదయాత్రలు చేపడుతామని వెల్లడించారు. అదానీకి ఇస్తున్న డంపింగ్ యార్డును వ్యతిరేకించినందుకు సీబీసీఐడీ కేసులో విచారణ అంటూ బెదిరించారని పేర్కొన్నారు. తనను ఎవరూ ఎన్ని బెదిరింపులు చేసినా భయపడను కాక భయపడనని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే బదులు రేవంత్ రెడ్డి నియోజకవర్గం అయిన కొడంగల్‌లో డంపింగ్ యార్డును



పెట్టుకోవాలని సూచించారు. కొడంగల్ లో పెడుతున్న పరిశ్రమలు హుజురాబాద్ నియోజకవర్గంలో పెట్టాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతారని తెలిపారు. భూముల ధరలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఆదివారం డంపింగ్ యార్డు పెట్టే ప్రాంతంలో మల్లన్న దేవాలయం ఉందని, దానిని తొలగించే ప్రయత్నాన్ని అడ్డుకొని తీరుతామని అన్నారు. జిల్లాకు చెందిన మంత్రి పొన్నం, కేంద్రంలో ఉన్న బండి సంజయ్‌కు , ఎంపీ ఈటల రాజేందర్‌కు బాధ్యత లేదా అంటూ ప్రశ్నించారు.

# పీజీ వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి.. సమగ్ర విచారణ జరపాలని మాజీ మంత్రి డిమాండ్

**మహబూబ్ నగర్ :** జడ్చర్ల మండలం పలుగుగడ్డ తండాకు చెందిన పీజీ వైద్య విద్యార్థిసురేష్ మృతి పట్ల మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తీవ్రవిచారం వ్యక్తం చేశారు. పలుగుగడ్డ తండాలో సురేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి మాజీ మంత్రి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంతో కష్టపడి చదివి ఉస్మానియాలో పీజీ సీటు సాధించిన సురేష్ అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరం అన్నారు. పేద గిరిజన విద్యార్థి చనిపోతే మెడికల్ కాలేజ్ సిబ్బంది,ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి ఈ ఘటన నిదర్శనమని మండిపడ్డారు. సురేష్ మృతిపై



సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సురేష్‌కు ఎస్వీఎస్ కాలేజ్ లో ఎంబీబీఎస్ సీటు వచ్చిన సందర్భంలో అభినందించిన విషయాన్ని

# నందికొండలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దహనం

**నందికొండ :** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్ సభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా నల్లగొండ జిల్లా నందికొండ హిల్ కాలనీలోని నాగార్జునసాగర్ –హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాక్ విభజనతో పోలుస్తూ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర దుమారం లేపాయి. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన ఆయనపై నిరసనలు వెల్లువెత్తాయి. తెలంగాణ సమాచారంతెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఉనికిని, అమరవీరుల త్యాగాలను అవమానించారని, వేలమంది బలిదానాలతో సిద్ధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచేలా మాట్లాడటం తేజస్వి సూర్య అజ్ఞానానికి నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఆయన వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కౌన్సిలర్ హీరేకర్ రమేష్ జి, నందికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముఖ్య సలహాదారుడు ఆదాసు విక్రం,1వ వార్డు ఇంచార్జ్ పమ్మి జనార్దన్ రెడ్డి, 2 వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ గని, 4వ వార్డు ఇంచార్జ్ విజయ్,6 వా వార్డ్ ఇంచార్జ్ చంద్రమౌళి నాయక్, 10 వ వార్డ్ ఇంచార్జ్ కోడా విజయ్, అర్జున్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శేఖరా చారి, మన్సూర్, రవి, నజీర్, భూయాకర్ శివ, పిట్ట సైదులు , దార రవి, తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీ వలలో చిక్కుంద ఎక్సైజ్ సీఐ..రూ.2లక్షలు లంచం తీసుకుంటూ పట్టివేత



**నిజామాబాద్ :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. బిచ్కుందలోని అద్దె ఇంట్లో ఉంటున్న సీఐ బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కల్లు దుకాణం మరో గ్రామానికి తరలింపునకు అనుమతులు, కేసులు నమోదు చేయవద్దని కోరగా ప్రతిఫలంగా ఎక్సైజ్ సీఐ దీను సత్యనారాయణ లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు. అదేవిధంగా అతని వద్ద అదనంగా లభించిన రూ.45, 670లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వివరించారు. సీఐపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో వెల్లడించారు.

# రుణమాఫీపై నిలదీసినందుకు రైతులపై అక్రమ కేసులు : మాజీ మంత్రి వేముల ఆగ్రహం



**నిజామాబాద్ :** రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్నినిలదీసినందుకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ నాయకులను, రైతులపై అక్రమ కేసులు పెట్టి రెండేండ్లుగా కోర్టుల చుట్టూ తిప్పుతుండడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని తీవ్రంగా ఖండించారు. బాల్కొండ నియోజకవర్గంలో 52,000 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 22,000 మంది రైతులకు రుణమాఫీ చేసి ఇంకా 30,000 మంది రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీసినందుకు కేసులు పెట్టి శుక్రవారం ఆర్మూర్ కోర్టులో కేసు హియరింగ్‌కు హాజరైన బీఆర్ఎస్ నాయకులు,రైతులు తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేయడం సమంజసమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని , పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని ,రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని వేముల డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ వాహనదారులకు గుడ్ న్యూస్ భారీ ఆర్‌ఓబీ ప్రారంభం

**హైదరాబాద్ :** వాహనదారులకు శుభవార్త అందింది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఓ రోడ్ ఓవర్ బ్రిడ్జి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దీన్ని ప్రారంభించారు. నాలుగు లేన్ల వంతెన ఇది. నేరుగా జాతీయ రహదారి– 44, పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు ట్రాఫిక్‌ను గణనీయంగా సులభతరం చేస్తుంది ఆర్‌ఓబీ. రోజువారీ లక్ష మంది వాహనదారులు, ఇతర ప్రయాణికుల రాకపోకలకు ఇది ఉపశమనం ఇస్తుంది. సికింద్రాబాద్– ఫలక్‌నుమా– శివరాంపల్లి రైల్వే లైన్‌లోని లెవెల్ క్రాసింగ్ నంబర్ 7పై దీన్ని నిర్మించింది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. శాస్త్రిపురం మీదుగా మైలార్‌దేవ్‌పల్లి నుండి ఫలక్‌నుమా ఆర్టీసీ డిపో వరకు గల దూరాన్ని అనుసంధానించడానికి ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టింది. తాజాగా మంత్రి శ్రీధర్ బాబు దీన్ని ప్రారంభించారు. ఈ ఆర్‌ఓబీ వల్ల బిబి కా చష్మా, ఫలక్‌నుమా, వట్టేపల్లి, శాస్త్రిపురం, తీగలకుంట, నవాబ్ సాహెబ్ కుంట (శంషాబాద్ వైపు), కాటేదాన్, ఆరంఘర్ వంటి పరిసర ప్రాంతాల ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుంది. బండ్లగూడ రోడ్డుకు చేరుకోవడానికి నేషనల్ పోలీస్ అకాడమీ, శివరంపల్లి లేదా ఫలకనుమా–చంద్రాయణగుట్ట మార్గం గుండా గతంలో నాలుగు కిలోమీటర్ల అనవసరపు ప్రయాణం ఉండేది. ఇప్పుడు ఈ ఆర్‌ఓబీతో



వల్ల అయిదు నిమిషాల్లో గమ్యాన్ని చేరుకోవచ్చు. మైలార్‌దేవ్‌పల్లి నుండి వట్టేపల్లి మీదుగా ఫలక్‌నుమా ఆర్టీసీ బస్ డిపోకు వెళ్లే ప్రయాణ సమయం కూడా 30 నిమిషాలు ఆదా అవుతుంది. ఈ ఆర్‌ఓబీ నిర్మాణ వ్యయం మొత్తం 71 కోట్ల రూపాయలు. దీని మొత్తం పొడవు 490 మీటర్లు. ఇందులో రైల్వే భాగం 37.28 మీటర్లు. వంతెన మొత్తం వెడల్పు 16.60 మీటర్లు. ఇది అత్యాధునిక స్టీల్ గర్డర్‌లతో నిర్మితమైంది. ఆర్సీసీ ప్రీకాస్ట్ ఎలిమెంట్స్, పీఓటీ– పీటీఈఎఫ్ బేరింగ్, మాడ్యులర్ ఎక్స్‌పాన్షన్ జాయింట్లు వంటి ఆధునిక ఇంజనీరింగ్ ప్రత్యేకతలతో రూపుదిద్దుకుంది. సమయం ఆదా కావడంతో పాటు ఇంధన వినియోగం, వాహన కాలుష్యం తగ్గుతుంది.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జశ్రీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మాన్సూన్‌కు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలం గాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు



సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

# భానుడి భగభగల వేళ బిగ్ రిలీఫ్, 4 రోజులు ఇక వర్షాలే ఈ జిల్లాలకు తాజా అలర్ట్

**హైదరాబాద్ :** భానుడి భగభగలతో తెలుగు రాష్ట్రాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. చాలా చోట్ల 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... జనాలు ఉక్కిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో... వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలో రాగల 4 రోజుల పాటు పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో భానుడు తీవ్ర రూపం దాల్చుతున్నాడు. రెండు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 45 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతు ఒడటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడితో పాటు వడగాల్పులు, ఉక్కబోతతో జనాలు



భయపడిపోతున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతవారణశాఖ హెచ్చరిస్తోంది. ఏపీలోని శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 301 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ఇక 55 మండలాల్లో సాధారణ వడగాలులు ఉంటాయని తెలిపింది. ఇక పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, రాయలసీమ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తాజాగా అధికారులు హెచ్చరించారు. వాతావరణ శాఖ తాజా అంచనాలుఇదే సమయంలో తెలంగాణ జిల్లాలకు వర్షాల పైన అలర్ట్స్ జారీ అయ్యాయి. దక్షిణ తెల ంగాణ లోని జిల్లాలపై వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుంది. ఇవాళ ఉదయం 8 గంటలలోపు జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రానున్న ఆరు ఉష్ణోగ్రతలు చేసింది.


# సికింద్రాబాద్ నుంచి ఏపీ మీదుగా అయోధ్య, పుష్కరాల స్పెషల్: హాల్ట్ స్టేషన్లు

**హైదరాబాద్ :** సికింద్రాబాద్ నుంచి అయోధ్య–వారణాశికాశీ– బైద్యనాథ్ ధామ్ పుణ్యక్షేత్ర పేరుతో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మరో టూర్ ప్యాకేజీని ప్రకటించింది. పూరీ– బైద్యనాథ్ ధామ్– ప్రయాగ్ రాజ్ వంటి ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలు ఈ ప్యాకేజీలో ఉన్నాయి. యమున పుష్కరాలు దీనికి అదనం. యమున పుష్కరాలను పురస్కరించుకుని ప్రయాగ్ రాజ్ లో పుణ్య స్నానాలు ఆచరించే అవకాశం లభించింది. భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆయా పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. 9 రాత్రులు/ 10 పగళ్లు సాగే యాత్రా స్పెషల్ ఇది. జూన్ 3వ తేదీన



సికింద్రాబాద్ నుండి ఈ భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్తుంది. మొత్తం 702 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్– 160, 3ఏసీ– 490, 2ఏసీ– 52. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ ఎక్స్‌ప్రెస్‌కు ఖాజీపేట్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్‌లల్లో హాల్ట్ సౌకర్యం ఉంది. ఆయా స్టేషన్లల్లో ప్రయాణికులు బోర్డింగ్/డీబోర్డింగ్ అవ్వొచ్చు. తొలుత పూరీ జగన్నాథుడిని దర్శించుకోవచ్చు. అక్కడ ప్రత్యేక పూజలు చేయవచ్చు. కోణార్క్ సూర్య దేవాలయాన్ని సందర్శించవచ్చు. అనంతరం బైద్యనాథ్ ధామ్ కు వెళ్తుంది ఈ ఎక్స్ ప్రెస్. ఇక్కడ విష్ణుపాద ఆలయాన్ని దర్శించుకునే వెసలుబాటు ఉంది. ఆ తర్వాత వారణాశి వెళ్తుంది. కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి, అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయాల్లో పూజల్లో పాల్గొనవచ్చు. అక్కడి కారిడార్ సందర్శనం కూడా ఈ టూర్ ప్యాకేజీలో ఉంది. సాయంత్రం గంగా హారతిని తిలకించవచ్చు. దీని తర్వాత అయోధ్య. చారిత్రాత్మక బాల రాముడి ఆలయం, హనుమాన్ గర్హి ఆలయాలను దర్శించవచ్చు. అక్కడి సరయూ నది హారతిలో పాల్గొనవచ్చు. అక్కడి నుంచి ప్రయాగ్ రాజ్ కు చేరుకుంటుంది. యమున పుష్కల సందర్భంగా అక్కడ త్రివేణి సంగమంలో స్నానం ఆచరించే అవకాశం కల్పించింది ఐఆర్సీటీసీ ఈ టూర్ ద్వారా. ప్రయాగ్ రాజ్ సందర్శనతో ఈ టూర్ ప్యాకేజీ టూర్ ముగుస్తుంది.

# డీలిమిటేషన్‌తో సౌత్ వాయిస్ తగ్గుతుంది: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, ఏప్రిల్ 17:** డీలిమిటేషన్‌పై కేంద్రం వైఖరి కరెక్ట్ కాదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం మీ డియాతో మాట్లాడుతూ.. సీట్లు పెరిగితే ప్రస్తుతం నార్త్ రాష్ట్రాలకు – సౌత్ రాష్ట్రాలకు ఉన్న గ్యాప్ డబుల్ అవుతుందని చెప్పారు. సీట్ల పెంపుపై కమిషన్ వేయాలని.. అన్ని రాష్ట్రాల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై అఖిలపక్షం పెట్టాలన్నారు. దేశభక్తితో కూడిన వైఖరి కాదని... దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర ఇది అంటూ మండిపడ్డారు. నార్త్ రాష్ట్రాల బలంతో శాశ్వతంగా కుర్చీలో కూర్చునే కుట్ర ప్రధాని మోదీ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ చేసే డీలిమిటేషన్ వల్ల సౌత్ రాష్ట్రాలకు 66 సీట్లు పెరిగితే – నార్త్ రాష్ట్రాలకు 190 సీట్లు దాటుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. 50 శాతం ప్రకారం సీట్ల పెంపు చేస్తే భవిష్యత్తులో దక్షిణ రాష్ట్రాల అవసరం లేకుండా పోతుందన్నారు. 1970లో ఇందిరా గాంధీ – వాజపేయి హయాంలో ప్రయత్నం చేసి గొడవ వద్దని వదిలేశారని గుర్తుచేశారు. బీజేపీ చేసే డీలిమిటేషన్ వల్ల సౌత్ రాష్ట్రాలు ప్రత్యేక దేశం కావాలని డిమాండ్ చేసే పరిస్థితి ఉంటుందన్నారు. ఇదే పద్ధతి ఉంటే సౌత్ రాష్ట్రాలు కేవలం ఓట్లు పేర్కొన్నారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17-18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com